
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
శనివారం 13 ఏప్రిల్ 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.158	230	262
సూర్యాపేట	రూ. 150	220	250
నల్లగొండ	రూ.158	230	260

ఉష్ణోగ్రత గరిష్ఠం 39.5 । కనిష్ఠం 24.2



ఆర్జాలబావి ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం రాశులు



జలమయమైన జిల్లాకేంద్రంలోని పానగల్ రోడ్డు

కురిసింది వాన..

- ఉదయం నుంచి మేఘావృతమైన ఆకాశం
- సాయంత్రం పలకరించిన చిరుజల్లులు
- నల్లగొండలో మోస్తరు వర్షం


ఎండ వేడిమితో అతలాకుతలమైన జిల్లా ప్రజలను చిరుజల్లులు పలకరించాయి. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మేఘావృతమైన ఆకాశం సాయంత్రం కొంతసేపు వర్షం కురిసింది. జిల్లా కేంద్రంలో సాయంత్రం 6.30 గంటల సమయంలో ఓ మోస్తరు వాన పడింది. నిండు వేసవిలో అక్కడక్కడ వర్షం పడటంతో ప్రజలు ఎండల నుంచి కాస్త ఉపశమనం పొందారు. వాతావరణ శాఖ తెలంగాణలో మూడు, నాలుగు రోజులపాటు వర్షాలు కురుస్తాయని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పడుతున్న వానలతో కొంత మేరకు ప్రజలకు ఉపశమనం చేకూరింది. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఆర్జాలబావి సమీపంలో ఏర్పాటు చేసిన ఐకేపీ సెంటర్‌లో ధాన్యం రాశులు తడిసిపోయాయి. వరదకు కొట్టుకుపోతున్న ధాన్యాన్ని ఆపేందుకు రైతులు నానా తంటాలు పడ్డారు.

- నల్లగొండ



ఆకాశం మేఘావృతం కావడంతో చీకటిగా మారిన జిల్లాకేంద్రంలోని క్లాక్‌టవర్ సెంటర్

ముహూర్తం ఖరారు



వేలాది మంది కార్యకర్తలు. వందలాది వాహనాలతో ర్యాలీలు, ప్రదర్శనలకు వేళయింది. అంగ, అర్థ బల నిరూపణ చేసుకునేందుకు సమయం ఆసన్నమైంది. పార్టీల అగ్రనేతలు, లేదంటే జాతీయ, రాష్ట్రస్థాయి నేతలను తీసుకొచ్చి నామినేషన్లు వేసేందుకు ఆయా పార్టీల అభ్యర్థులు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నల్లగొండ, భువనగిరి పార్లమెంట్ స్థానాలకు ఆయా పార్టీలు ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించగా, నామినేషన్ల తేదీ దగ్గరపడుతుండడంతో అన్ని ఏర్పాట్లను చేసుకుంటున్నారు. నామినేషన్ల ఘట్టానికి మంచి ముహూర్తం కోసం వేదపండితులను ఆశ్రయిస్తున్నారు.

-(ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

- 18వ తేదీ నుంచి నామినేషన్లకు సిద్ధమవుతోన్న అభ్యర్థులు
- శుభ ఘడియలు అయిదు రోజులే అంటున్న పండితులు
- ఆ రోజుల్లోనే నామినేషన్ల దాఖలుకు సన్నాహాలు
- నామినేషన్లకు పార్టీల ముఖ్యనేతలు హాజరయ్యేలా కసరత్తు
- కాంగ్రెస్ అభ్యర్థుల నామినేషన్లకు తేదీలు ఖరారు

లోక్‌సభ ఎన్నికల కీలకఘట్టానికి రంగం సిద్ధమైంది. ఈ నెల 18న నోటిఫికేషన్ విడుదలకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతుంటే, అదే రోజు నుంచి నామినేషన్ల ఘట్టం మొదలు కానుంది. ప్రధాన పార్టీలు ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించడంతో ప్రచారం కొనసాగుతోంది. ఈ నెల 18వ తేదీ నుంచి 25వరకు మాత్రమే నామినేషన్ల దాఖలుకు అవకాశం ఉండడంతో శుభముహూర్తాలు, పేరుబలాలు చూసుకొని నేతలు నామినేషన్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. వేదపండితులను ఆశ్రయిస్తూ అనువైన తేదీలను తెలుసుకుంటున్నారు. ప్రధాన పార్టీల నేతలు నామినేషన్ రోజే తమ సత్తా చాటేలా భారీ ర్యాలీలు, కీలకనేతల ఆధ్వర్యంలో బహిరంగసభలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. నామినేషన్ల ఘట్టానికి తెరలేవనుండడంతో లోకసభ సమరం వేడెక్కనుంది.

18 నుంచి నామినేషన్ల దాఖలు

ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈ నెల 18 నుంచి 25వరకు అభ్యర్థులు నామినేషన్ల దాఖలు చేయాల్సి ఉంటుంది. ఈ ఎనిమిది రోజుల్లో తమ పేరు బలం, పార్టీ బలం, జన్మనక్షత్రాల ప్రకారం ఏరోజు నామినేషన్ వేస్తే సత్ఫలితాలుంటాయని కోరుతూ అభ్యర్థులు వేదపండితులను ఆశ్రయిస్తున్నారు. పండితుల సూచనల ప్రకారం, మరోవైపు పార్టీ అధిష్ఠానాల నుంచి వస్తోన్న ఆదేశాల మేరకు నామినేషన్ల దాఖలుకు సిద్ధమవుతున్నారు. వేదపండితులు పేర్కొంటున్న ప్రకారం 19, 23, 25వ తేదీలు తిథి, నక్షత్రాల ప్రకారం శుభగడియలు కావని, ఆ రోజుల్లో నామినేషన్లు వేయడం సబబు కాదని చెబుతుండడంతో ఆ రోజుల్లో నామినేషన్లుండే అవకాశం లేదు. 18, 20, 21, 22, 24 తేదీల్లో శుభఘడియలుండడంతో ఈ తేదీల్లో అభ్యర్థుల జాతకాల ప్రకారం అత్యంత శుభదినం ఉన్నరోజు నామినేషన్ వేసేందుకు సిద్ధమవుతున్నారు.

నామినేషన్లకు అభ్యర్థులు సిద్ధం

కాంగ్రెస్ భువనగిరి అభ్యర్థి చామలకిరణ్‌కుమార్‌రెడ్డి ఈ నెల 21న, సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్ 19న, నల్లగొండ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి 24న నామినేషన్లు దాఖలు చేయాలని నిర్ణయించారు. వీరి నామినేషన్ల కార్యక్రమాలకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డితోపాటు పార్టీ జాతీయనేతలు హాజరవుతారని చెబుతున్నారు. వీలైతే నామినేషన్ల దాఖలు రోజు పార్లమెంట్ నియోజకవర్గకేంద్రాల్లో బహిరంగసభలు నిర్వహించాలని యోచిస్తున్నారు. అయితే మే మొదటివారం లో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ పర్యటన ఖరారైతే బహిరంగసభల తేదీలను మార్చే అవకాశం కనిపిస్తోంది. మరోవైపు నల్లగొండ నుంచి బీజేపీ అభ్యర్థిగా బరిలో ఉన్న శానంపూడి సైదిరెడ్డి కూడా 22 లేక 24న నామినేషన్ దాఖలు చేసే అవకాశం కనిపిస్తోంది. ఈయన నామినేషన్ రోజునే నల్లగొండలో భారీ బహిరంగసభ నిర్వహించి, బీజేపీ దిగ్గజనేత, తమిళనాడు పార్టీ అధ్యక్షుడు అన్నామలైని తీసుకురావాలని యోచిస్తున్నారు. భువనగిరి లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ నామినేషన్‌కు సైతం కీలక జాతీయనేతను ఆహ్వానిస్తున్నట్లు చెబుతున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థులు కంచర్ల కృష్ణారెడ్డి, క్యామమల్లేశ్ నామినేషన్ల కార్యక్రమాలకు కేటీఆర్ రానున్నట్లు చెబుతున్నారు. మాజీ సీఎం కేసీఆర్ సైతం జిల్లాలో ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొనేలా ప్రణాళిక ఖరారు చేస్తున్నట్లు పార్టీనేతలు చెబుతున్నారు.

కమీషన్ నిర్వాహకులకు.. ఖర్చు రైతులకు



గుండాల మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో కిరాయి యంత్రంతో ధాన్యం పడుతున్న రైతులు

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో కేంద్రాల నిర్వాహకులు, మార్కెట్ అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా ప్రతీ సంవత్సరం వేలాది రూపాయల కమీషన్ పొందుతున్న కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతులకు టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉంచకుండా వ్యవసాయ మార్కెట్లపైనే ఆధారపడుతున్నారు.

- మోత్కూరు, గుండాల

- పాత పద్ధతుల్లోనే ప్యాడీ క్లీనింగ్
- సాంకేతికత పెరిగినా.. మారని తీరు
- కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో లేని ప్యాడీ క్లీనర్లు
- అధునాతన ప్యాడీ క్లీనర్లు అద్దెకు తెచ్చుకుంటున్న రైతులు

వ్యవసాయ మార్కెట్లు ఇచ్చే టార్పాలిన్లు సరిపోక వర్షాలు కురిస్తే కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దవుతోంది. ఇక ప్యాడీ క్లీనర్ల విషయానికొస్తే తమ వద్ద ఉన్న పాత మోడల్ ప్యాడీ క్లీనర్లను కేంద్రానికి ఒకటి చొప్పున ఇస్తున్నారు. అందులో కొన్ని పని చేస్తుండగా, మరి కొన్ని పని చేయడం లేదంటున్నారు. దీంతో రైతులు ప్యాడీ క్లీనర్లు అద్దెకు తెచుకుని ధాన్యం శుభ్రం చేస్తున్నారు.

ఆధునిక ప్యాడీ క్లీనర్లు అందుబాటులోకి వచ్చినా..

వ్యవసాయ రంగంలో రైతులకు శ్రమ తగ్గి, పని సులువు అయ్యేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన ఎన్నో రకాల యంత్రాలు తయారు చేస్తున్నారు. అందుబాటులోకి వచ్చిన అధునాతన యంత్రాల్లో ప్యాడీ క్లీనర్ కూడా ఉంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ప్యాడీ క్లీనర్‌తో ఎక్కువ మంది కూలీలు అవసరం లేకుండా, తక్కువ శ్రమతో తక్కువ సమయంలో ఎక్కువ ధాన్యం శుభ్రమవుతుంది. ఆధునిక ప్యాడీ క్లీనర్లు అందుబాటులోకి వచ్చినా వ్యవసాయ మార్కెట్లు కాలం చెల్లిన పాత మోడల్ యంత్రాలనే వాడుతున్నాయి. మార్కెట్లు ఇచ్చిన యంత్రాలు పని చేయకపోతే కేంద్రాల నిర్వాహకులే మరమ్మతు చేయించుకోవాలని చెబుతుండటంతో వారు వాటిని పక్కన పడేశారు. పాత మోడల్ క్లీనర్లతో ధాన్యం శుభ్రం చేయడానికి ఎక్కువ కూలీలు, ఎక్కువ సమయం పడుతుండటంతో రైతులు ప్రైవేటు వ్యక్తుల వద్ద నూతన ప్యాడీ క్లీనర్లను అద్దెకు తెచ్చుకుంటున్నారు. మోత్కూరు మండలంలో సదర్శాపురం, దాచారం గ్రామాల ఐకేపీ కేంద్రాలకు మార్కెట్ నుంచి ఇచ్చిన ప్యాడీ క్లీనర్లు పనిచేయక పోవడంతో రైతులు నూతన ప్యాడీ క్లీనర్లు అద్దెకు తెచ్చుకుని ధాన్యం శుభ్రం చేస్తున్నారు. అడ్డగూడూరు మండలం చౌళ్లరామారం ఐకేపీ కేంద్రంతో ప్యాడీ క్లీనర్ లేక రైతులు ట్రాక్టర్‌కు అమర్చిన ఫ్యాన్ ద్వారా గంటకు రూ.800అద్దె చెల్లించి ధాన్యం శుభ్రం చేసుకుంటున్నారు. ఆధునిక యంత్రాలు వాడుకలోకి వచ్చాక కూడా ప్రభుత్వం పాత కాలం నాటి యంత్రాలనేకొని వ్యవసాయ మార్కెట్లకు అందిస్తుండటంతో అటు ప్రజా ధనం వృథాకావడంతోపాటు ఇటు రైతులకు ప్రయోజనం లేకుండా పోతుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆధునిక ప్యాడీ క్లీనర్లు అందించాలంటున్న రైతులు

ఫ్యాన్లకు కాలం చెల్లినట్టుగానే పాత మోడల్ ప్యాడీ క్లీనర్లకు కూడా కాలం చెల్లిందని రైతులంటున్నారు. ప్రైవేటు వ్యక్తులకు ఆధునిక ప్యాడీ క్లీనర్లకు గంటకు రూ.వెయ్యి అద్దె చెలిస్తున్నామని, మార్కెట్ కమిటీలు, ఐకేపీ కేంద్రాలు ఆధునిక ప్యాడీ క్లీనర్లు తెచ్చి ఉచితంగా ఇవ్వకపోయినా గంటకు రూ.ఐదు వందలు అద్దె తీసుకున్నా తమకు లాభమే కదా అంటున్నారు.



ప్యాడీ క్లీనర్ పని చేయడం లేదు

గుండాల ధాన్యం కొనుగోలు కేంద్రంలో ప్యాడీ క్లీనర్ పని చేయడం లేదు. దీంతో ప్రైవేటు ప్యాడీ క్లీనర్‌తో ధాన్యాన్ని పడుతున్నాం. దీంతో మాపై అదనపు భారం పడుతుంది.

- తూనం నరేశ్ రైతు, పాచిల్ల, మం.గుండాల



గంటకు రూ.1000 చెల్లిస్తున్నాను

ధాన్యం కొనుగోలు కేంద్రంలో ప్యాడీ క్లీనర్ తుప్పు పట్టిపోయింది. దీంతో ధాన్యం పట్టడానికి ప్యాడీ క్లీనర్ లేకపోవడంతో తప్పని పరిస్థితుల్లో ప్యాడీ క్లీనర్‌ను కిరాయికి తీసుకుని గంటకు రూ.1000 చెల్లించాల్సి వస్తుంది.

- ఉడుగుల ఎల్లయ్య, వెల్మజాల, మం.గుండాల

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా

ప్యాడీ క్లీనర్లు పని చేయని విషయమై జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తా. త్వరలో ప్యాడీ క్లీనర్లను మరమ్మతు చేయించి రైతులకు అందుబాటులోకి వచ్చే విధంగా చూస్తా.

- నాగయ్య, సీఈవో, పీఏసీఎస్, గుండాల

గతేడాది నుంచే మార్కెట్లోకి అధునిక ప్యాడీ క్లీనర్లు



చౌళ్ల రామారంలో ఫ్యాన్‌తో ధాన్యం శుభ్రం చేస్తున్న రైతులు

రైతులు పండించిన ధాన్యాన్ని శుభ్రపర్చేందుకు మొదట్లో ఫ్యాన్లు ఉపయోగించే వారు. ఆ తర్వాత ప్యాడీ క్లీనర్లు (జల్లెడలు) వచ్చాయి. ఈ ప్యాడీ క్లీనర్లతో ధాన్యం శుభ్రం చేయడానికి ముగ్గురు నలుగురు వ్యక్తులు ధాన్యం గంపలతో ఎత్తి జల్లెడపై పోస్తే, మరో ముగ్గురు నలుగురు శుభ్రమై వచ్చిన ధాన్యం ఎత్తివేరేచోట రాశి పోయాల్సి ఉంటుంది. ఇప్పుడు మార్కెట్లో(వాడుకలో)కి వచ్చిన ప్యాడీ క్లీనర్‌తో పైపు ధాన్యం రాశి మధ్యన ఉంచి ఒక వ్యక్తి ధాన్యాన్ని పైపు దగ్గరకు లాగితే చాలు ధాన్యం శుభ్రమై రాశి పడుతుంది. ఈ యంత్రంతో కూలీల అవసరం లేకపోగా శ్రమ తగ్గడంతోపాటు సమయం కూడా ఆదా అవుతోంది. ఆధునిక ప్యాడీ క్లీనర్‌కు గంటకు రూ.1000 అద్దె చెల్లిస్తున్నారు. గంటకు 60 నుంచి 70 బస్తాల ధాన్యం శుభ్రమవుతుంది.

ప్రజల కోసం పనిచేసిన వారిని మరువలేం

- ఒకే వ్యక్తి బహుళరంగాల్లో ప్రతిభా పాటవాలు కలిగి ఉండడం అరుదు
- 'దాసి' సుదర్శన్ సంస్మరణ సభలో వక్తలు





మిర్యాలగూడలో దాసి సుదర్శన్ సంస్మరణ సభలో మాట్లాడుతున్న సినీ నటుడు భూపాల్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, ఏప్రిల్ 12: నిత్యం తపనతో ప్రజల కోసం పనిచేసిన వారిని మరువలేమని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మిర్యాలగూడ వాసవీభవన్‌లో జరిగిన విలక్షణ చిత్రకారుడు, 'దాసి' సుదర్శన్ సంస్మరణ సభలో ఆయన మాట్లాడుతూ మతం కంటే మానవత్వం గొప్పదన్నారు. మానవతావాదంతో మనుషులను తట్టిలేపిన వారిని జనం కీర్తిస్తూనే ఉంటారన్నారు. అలాంటి వారి స్ఫూర్తితో మత విద్వేషాలను పక్కకు నెట్టి ఒక్కటిగా కలిసి నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. కళాకారులకు, సాహిత్యకారులకు ప్రభుత్వం తగిన విధంగా ఆదుకుంటుందన్నారు. నటుడు, 'దాసి', 'కొమరం భీం' ఫేం భూపాల్ మాట్లాడుతూ 'దాసి' సినిమా చిత్రీకరణ సమయంలో ఆయనలోని గొప్ప వ్యక్తిత్వం గురించి తెలుసుకున్నానని అన్నారు. పని పట్ల ఆయనకున్న అంకిత భావం, కార్యదీక్ష అతనికి జాతీయ గుర్తింపు తెచ్చిపెట్టిందన్నారు. నెమ్మదిగా ఉంటూనే స్థిరమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేసేవారన్నారు.

చిత్రకారుడిగా, ఉపాధ్యాయుడిగా..

సినీ దర్శకుడు, విరాటపర్వం ఫేం వేణు ఊడుగుల మాట్లాడుతూ ఒక వ్యక్తి బహుళ రంగాల్లో ప్రతిభా పాటవాలను కలిగి ఉండటం అరుదు అని, రచయితగా, నటుడిగా, చిత్రకారుడిగా, ఉపాధ్యాయుడిగా, పాత్రికేయుడిగా సుదర్శన్ భిన్న రంగాల్లో ప్రతిభ చూపారన్నారు. ప్రస్తుతం సాంకేతిక విప్లవం ప్రపంచాన్ని ఏకం చేస్తుంటే దేశంలో మత విద్వేషాలతో ప్రజల ఐక్యతను దెబ్బతీసే కుట్ర సాగుతోందన్నారు. ఈ విషయమై సుదర్శన్ ఎంతో మదనపడేవారని, రచనలు, కళల ద్వారా ఈ విద్వేషాన్ని అడ్డుకోవాలని చెప్పేవారని గుర్తు చేశారు. 'దాసి' తర్వాత దక్షిణ భారతదేశంలో 30 సంవత్సరాల వరకు జాతీయ అవార్డు ఎవరికీ దక్కలేదని పేర్కొన్నారు. సినిమా, సాహిత్యం దేశ సమగ్రత, సమైక్యతకు స్ఫూర్తినిచ్చే విధంగా కృషి జరగాలన్నారు. మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు మాట్లాడుతూ సుదర్శన్ అంటే జ్ఞాపకాల దొంతర అని, ఆయన ఎవరితో కలిసినా ఎన్నో ముచ్చట్ల కలబోతగా ఉంటుందన్నారు. 1949 నుంచి తెలంగాణ సమాజంలో జరిగే పరిణామాలను గమనిస్తే రెండు విషయాలు స్పష్టమవుతాయని అన్నారు. అడువుల హననం, భూ కబ్జాలు, హత్యలు, కాలుష్య కారక పరిశ్రమలు లాంటి పాలకుల విధ్వంసకర అభివృద్ధి ఒకవైపు అణచివేతను ఎదిరిస్తూ భూమి, భుక్తి, విముక్తి కోసం సాగిన, సాగుతున్న పోరులో ఒరిగిన వీరుల అసమాన త్యాగాలు మరోవైపు కనిపిస్తుందన్నారు. రెండో కోవకు చెందినవాడే దాసి సుదర్శన్ అని పేర్కొన్నారు. మార్క్సిస్టు భౌతికవాదానికి కట్టుబడిన శేషుతో కలిసి నడిచిన సుదర్శన్ గొప్ప మానవీయ విలువలను కలిగిన వ్యక్తి అని కొనియాడారు. అలాంటి వారి ఆశయాలను ముందుకు తీసుకపోవడమే వారికి మనం ఇచ్చే ఘనమైన నివాళి అన్నారు. సంస్మరణ సభలో జడ్పీ మాజీ ఛైర్మన్ రవికుమార్, కార్టూనిస్ట్ శంకర్, కస్తూరి ప్రభాకర్, ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ బీసం రామయ్య తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో కార్టూనిస్టులు నర్సింహ, చిత్ర, మానవహక్కుల వేదిక నాయకుడు పి.సుబ్బారావు, డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య, నాయకులు ఖుర్షీద్, యోగానంద్, భిక్షమయ్య, సైదాబాబా, డాక్టర్ ముప్పా రామారావు, వడ్డేపల్లి వెంకటేష్, గుండు శ్రీనివాస్, ఇనుగుర్తి విజయ్, కిరణ్మయి, జ్వాల వెంకటేశ్వర్లు, విజయ్‌కుమార్, ప్రకాష్, జాడి రాజు, ప్రసాద్, హరి, వేణుగోపాల్‌రెడ్డి, దేశిడి శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కులగణన అనంతరమే..

- స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 12: రాష్ట్రంలో కులగణన అనంతరమే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూన్‌లోనే స్థానిక సంస్థలకు వెళ్తామంటూ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ.. బీసీ కులగణన చేయకుండా ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. అసెంబ్లీ సాక్షిగా కులగణనకు తీర్మానం చేసిన ప్రభుత్వం ఇందుకు సంబంధించి జీవోను విడుదల చేయడమేకాకుండా బడ్జెట్ కేటాయించి ఇప్పుడు మాట తప్పుతోందన్నారు. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల అనంతరం వెంటనే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహిస్తామనడం హాస్యాస్పదమన్నారు. ప్రభుత్వానికి బీసీలపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే కులగణన చేసి బీసీల రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్‌చేశారు. అప్పుడే బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు సాధ్యమవుతామయన్నారు. ఖమ్మం పార్లమెంట్ టికెట్‌ను బీసీల ముద్దుబిడ్డ అయిన వి.హనుమంతరావుకు కేటాయించాలన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యాదర్శులు చక్రహరి రామరాజు, నేలపట్ల సత్యనారాయణ, కేశబోయిన శంకర్ ముదిరాజ్, రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, లింగంగౌడ్, మధు, భజరంగ్ ప్రసాద్ పాల్గొన్నారు.

అభ్యర్థులు తప్పుడు అఫిడవిట్లు సమర్పిస్తే చర్యలు

ఎస్పీ చందనాదీప్తి

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 12: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం రాజకీయ పార్టీల అభ్యర్థులెవరైనా తప్పుడు అఫిడవిట్‌ను సమర్పిస్తే చర్యలు ఉంటాయని ఎస్పీ చందనాదీప్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైన అభ్యర్థి నామినేషన్ పత్రాలు సమర్పించే ముందు సరైన ఆధారాలతో అఫిడవిట్‌ను సమర్పించాలన్నారు. ఉల్లంఘనలు అతిక్రమిస్తే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం ఐపీసీ సెక్షన్ 468, 420, 471, 120(బీ), ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 125 (ఏ), ఇతర చట్టాల కింద కేసులు నమోదు చేస్తామన్నారు.

రైతులను మోసగిస్తే చర్యలు

రైతులు పండించిన ధాన్యం కొనుగోలు విషయంలో ఐకేపీ,సొసైటీ కేంద్రాల ద్వారా కొనుగోలు చేసే రైస్ మిల్లర్లు ప్రభుత్వ మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలని, అలా కాకుండా ప్రభుత్వ మద్దతు ధరకు తక్కువ చెల్లించినా, రైతులు పండించిన ధాన్యంలో ఎక్కువ తేమ, తాలు పేరిట తరుగు విధిస్తూ రైతులను మోసం చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత ఎగుమతి దిగుమతులు అలసత్వం చేయవద్దని, వేసవి నేపథ్యంలో అవసరమైతే ఎక్కువమంది హమాలీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

చేనేత కార్మికులకు శుభవార్త

- 'చేనేతన్నకు భరోసా' పథకం అమలుకు కసరత్తు
- తీరనున్న కష్టాలు

చేనేత కార్మికుల స్వయం సమృద్ధి కోసం ప్రభుత్వం 'నేతన్న భరోసా' అనే కొత్త విధానానికి రూపకల్పన చేస్తోంది. చేనేత, మరమగ్గాల కార్మికులకు దీర్ఘకాలిక లబ్ధి చేకూరేలా ఈ పథకం ఉండాలని సీఎం ఇప్పటికే ఆదేశించారు. దీంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.

7

వైభవంగా ఆండాళ్ అమ్మవారి ఊంజల్ సేవ

● కొనసాగుతున్న వసంతోత్సవాలు

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 12: యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామివారి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆగమశాస్త్ర రీతిలో వేడుకలు నిర్వహించిన పూజారులు వేకువజామున సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపి పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకం, తులసీదళాలు, కుంకుమతో అర్చించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. అనుబంధ శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి నిత్యపూజలు, యాగశాలలో చండీహోమం శైవాగమ పద్ధతిలో చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారిని పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి సేవలో తీర్చిద్దారు. అమ్మవారి సేవను ఆలయతిరువీధుల్లో ఊరేగించిన అర్చకస్వాములు ప్రాకార మండపంలోని అద్దాల మండపంలోని ఊయలలో అధిష్ఠింపజేశారు. అర్చకుల వేదమంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల మధ్య ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఆలయఖజానాకు వివిధవిభాగాల నుంచి రూ.46,39,078 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.


నిత్యకల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

సీతారామ వసంతోత్సవాలు

శివాలయంలో శుక్రవారం నాలుగో రోజు శ్రీసీతారామచంద్ర స్వామివారి వసంతోత్సవాలు చేపట్టారు. నిత్యారాధనల అనంతరం మూలమంత్ర జపాలు, దశశాంతి పంచసూక్తి పారాయణాలతో పాటు అభిషేకం, ఆధ్యాత్మిక పారాయణం, స్వామిఅమ్మవార్లకు అష్టోత్తర శతనామార్చనలు జరిపారు. స్వామిఅమ్మవార్లను పట్టువస్త్రాలు, వజ్రవైఢూర్యాలతో అలంకరించి వేదపండితులు, పురోహితులు వేదమంత్రోచ్ఛరణల నడుమ మంగళవాయిద్యాలు మారుమోగుతుండగా యాగశాలకు తరలించారు. శైవాగమ రీతిలో హోమం జరిపి ప్రత్యేక పీటపై అధిష్ఠింపజేసి వసంతోత్సవాలు నిర్వహించారు. రాత్రి శివాలయంలో హనుమాన్ మూర్తులకు సహస్రనామార్చనలు, నివేదన నీరాజనం, మంత్ర పుష్పములు, వేదపండితులు, పురోహితులు, అర్చకులు తీర్థప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, ఈవో ఏ.భాస్కర్‌రావు, డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవో దూశెట్టి కృష్ణ, పర్యవేక్షకుడు రామరావు, పూజారి దోర్బల శ్రీధరశర్మ, ఉద్యోగ సిబ్బంది పాల్గొన్నారు.

గుట్టపై సాంస్కృతిక కార్యక్రమాలు


ధార్మిక వేదికపై కాళికాదేవి అవతారవిశేషాల నృత్యప్రదర్శన

యాదగిరిగుట్టపై ఆలయ ప్రాంగణంలో శుక్రవారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే పర్వదిన, ప్రత్యేక, పండుగ, సెలవు రోజుల్లో భక్తులు తిలకించేందుకు సంగీత, సాహిత్య, ధార్మిక మహాసభలు నిర్వహించాలని ఉగాది పర్వదినం నుంచి ఈవో భాస్కర్‌రావు కొత్తవిధానాన్ని ప్రవేశపెట్టారు. తూర్పురాజగోపురం ఎదురుగా ఈశాన్య దిశలో బంగారు క్యూలైన్ పక్కన తాత్కాలిక పందిరితో నృత్యప్రదర్శన నిర్వహించారు. కళాకారుల ప్రదర్శనను భక్తులు తిలకించారు.

ఆలయ అధికారులకు మెమోలు జారీ

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 12: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఏఈవో, సూపరింటెండెంట్‌లకు మెమో జారీకి ఈవో భాస్కర్‌రావు ఆదేశించినట్లు సమాచారం. గర్భాలయ ప్రాంగణంలో సుమారు 20 నుంచి 30 మంది భక్తులు ఓ పక్కన కూర్చుని ఉండగా అప్పుడే అక్కడకు చేరుకున్న ఈవో ఆరా తీయగా వారు పెళ్లిపత్రికలు పంపిణీ చేస్తున్నట్లు ఆయన దృష్టికి వచ్చింది. తక్షణమే ఆలయ ఏఈవో, సూపరింటెండెంట్‌లను పిలిచి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అక్కడ ఉన్న భక్తుల్లో ఒకరు ఇక్కడ కూర్చోవద్దా అని ఈవోతో వాగ్వాదం చేసినట్లు సమాచారం. అయితే ఈ సంఘటనపై అధికారులకు మెమోలు జారీ చేయాలని అడ్మినిస్ట్రేషన్ ఏఈవో గట్టు శ్రవణ్‌కుమార్‌ను ఆదేశించగా నేడో, రేపో మెమోలు అందనున్నాయి. ఇదిలా ఉంటే భక్తులను తీసుకువచ్చిన గజ్వేల్లి రఘును కూడా ఈవో మందలించినట్లు ప్రచారం సాగుతోంది.



అర్జాలబావి ఐకేపీ కేంద్రంలో ధాన్యం తడవకుండా రైతు ఇక్కట్లు



నల్లగొండలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో వర్షంలో వెళ్తున్న వాహనాలు



వేములపల్లి వద్ద నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై నిలిచిన నీరు



నల్లగొండలోని ఎన్జీ కళాశాల వద్ద వర్షంలో వాహనాల ప్రయాణం



నల్లగొండ పానగల్ బైపాస్ వద్ద మిర్యాలగూడ-నల్లగొండ మార్గంలో నిలిచిన నీరు

వాన.. వాన..

- అక్కడక్కడ చిరుజల్లులు, చల్లబడిన వాతావరణం
- కనగల్‌లో 21.3మి.మీ. వర్షం
- నల్లగొండలో మోస్తరు వాన

నల్లగొండ, ఏప్రిల్ 12 : వేసవితో కొద్దిరోజులుగా ఉక్కపోతతో వాతావరణం శుక్రవారం ఒక్కసారిగా మారింది. రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టగా, శుక్రవారం సాయంత్రం కురిసిన జల్లులతో చల్లబడింది. నల్లగొండ జిల్లాలో సగటున 39.5డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదైంది. ఇక మండలాల వారీగా పరిశీలిస్తే గుర్రంపోడు, పెద్దవూర, నాంపల్లి, వేములపల్లిలో 40డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా మిగతా అన్ని మండలాల్లో 35డిగ్రీల నుంచి 39.9డిగ్రీల వరకు పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇదిలా ఉండగా శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మబ్బులతో కూడిన వాతావరణం కనిపించింది. నల్లగొండ జిల్లా కేంద్రంలో సాయంత్రం 6.30గంటల సమయంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో అక్కడక్కడ చిరుజల్లులు కురిశాయి. వాతావరణశాఖ తెలంగాణలో మూడు, నాలుగు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పడుతున్న వానలతో కొంత మేరకు ప్రజలకు ఉపశమనం చేకూరింది. కనగల్‌లో 21.3మి.మీల వర్షపాతం నమోదైంది. చండూరు, త్రిపురారంలో 0.8మి.మీలు, నాంపల్లి, తిప్పర్తి, దేవరకొండ, గుండ్లపల్లి 0.5 మి.మీల చొప్పున చిరుజల్లులు కురిశాయి. వేములపల్లి మండలంలో సుమారు గంట పాటు వర్షం కురిసింది. నల్లగొండ సమీపంలోని ఆర్జాలబావి సమీపంలోని ఐకేపీ సెంటర్‌లో ధాన్యం రాశులు తడిసిపోయాయి. టార్పాలిన్‌లు గాలి దుమారానికి కొట్టుకుపోయాయి. ధాన్యం రాశులు తడవకుండా రైతులు ఇబ్బందులు పడ్డారు. కొన్నిరాశులు పూర్తిగా నీళ్లలో మునిగాయి. అదే విధంగా పానగల్ చౌరస్తాలో మురుగు కాల్వ పొంగిపొర్లి నీరు రహదారిపై నిలవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.





నల్లగొండలో చిరుజల్లులకు చిన్నారుల కేరింతలు, వర్షంలో కవర్‌సాయంతో వెళ్తున్న మహిళ



నల్లగొండ సమీపంలోని ఆర్జాలబావి వద్ద ఐకేపీ కేంద్రంలో నిలిచిన వర్షపు నీరు

ఉద్యాన శాఖను వేధిస్తున్న సిబ్బంది కొరత

- ఉన్న అరకొర సిబ్బందిపై అదనపు భారం
- ఎన్నికల విధులతో పాటు ప్రత్యేకాధికారులుగా నియామకం
- మూడు విధులు చూసుకోలేక ఒత్తిడిలో అధికారులు

భానుపురి, ఏప్రిల్ 12 : ఉద్యాన పంటల సాగుపై పర్యవేక్షణ కరవైంది. సిబ్బంది కొరతతో అధికారులు దృష్టి సారించలేకపోతున్నారు. రైతుల దృష్టిని ఉద్యాన పంటల వైపు మళ్లించడానికి కావాల్సిన సలహాలు, సూచనలు ఇచ్చే అధికారులు కరువయ్యారు. వరికి ప్రత్యామ్నాయంగా ఉద్యాన పంటలను ప్రోత్సహించాలని ప్రభుత్వాలు ఓ వైపు చెబుతున్నా రైతులకు సలహాలు ఇచ్చే సిబ్బంది లేకపోవడంతో రైతుల్లో అవగాహన పెంపొందడం లేదు. వెరిసి జిల్లాలో అనుకున్న స్థాయిలో ఉద్యాన పంటల సాగు పెరగడం లేదు. తక్కువ సిబ్బంది ఉన్నా వీరికి ఎన్నికల విధులతో పాటు గ్రామపంచాయతీలకు ప్రత్యేకాధికారులుగా నియమించడంతో ఉద్యాన పంటలపై పర్యవేక్షణ చేయడానికి సమయం దొరకడం లేదు. అటు పంచాయతీ విధులు, ఇటు ఉద్యాన పంటలపై కార్యక్రమాలతో ఒత్తిడడికి లోనవుతున్నారు.



కోదాడ మండలంలోని ఆయిల్‌పాం సాగును పరిశీలిస్తున్న అధికారులు

అదనపు బాధ్యతలు

ఉన్నదే ముగ్గురు అధికారులు కాగా వీరికి అదనంగా ఎన్నికల విధులు, గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారి విధులు కేటాయించారు. మూడు డ్యూటీలను చూసుకోవడానికి అధిక భారం పడుతోందని, ఆరోగ్యసమస్యలు ఉత్పన్నమవుతున్నట్లు తెలుస్తోంది. వేసవిలో రైతుల పంటలను ఎలా కాపాడుకోవాలని సలహాలు , సూచనలు ఇచ్చే అధికారులు అందుబాటులో లేకుండా పోతున్నారు. వ్యవసాయ శాఖలో కేటాయించిన రైతువేదికల వారీగా, మండలానికి ఒక అధికారిని కేటాయిస్తే ఉద్యాన పంటలు వేసి రైతులు డబుల్ ఆదాయం పొందే అవకాశం ఉంది.

రాష్ట్రవ్యాప్తంగా 157మంది మాత్రమే ఉద్యాన శాఖ అధికారులు ఉన్నట్లు సమాచారం. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని యాదాద్రిభువనగిరి జిల్లాలో నలుగురు, సూర్యాపేట జిల్లాలో ముగ్గురు, నల్లగొండలో తొమ్మిది మంది మాత్రమే ఉద్యాన శాఖ అధికారులు ఉన్నారు. నల్లగొండలో సుమారు 75 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు, యాద్రాది భువనగిరిలో 17 వేల ఎకరాలు, సూర్యాపేట జిల్లాలో 50 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగవుతున్నాయి.

సూర్యాపేట జిల్లాలో

సూర్యాపేట జిల్లాలో సుమారు 50 వేల ఎకరాల వరకు ఉద్యాన పంటలు సాగవుతుండగా, అందులో పండ్ల తోటలు 18 వేల ఎకరాలు, మిర్చి 24 వేల ఎకరాలు, కూరగాయలు 1,500 ఎకరాలు, ఆయిల్‌పాం సాగు 4వేల ఎకరాలు, ఇతర పంటలు 2 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. జిల్లాలో ఉద్యాన శాఖలో ఐదుపోస్టులు ఉండగా ముగ్గురు మాత్రమే అధికారులు ఉన్నారు. మరో ఇద్దరు ఆన్‌డ్యూటీలో నల్లగొండలో పనిచేస్తున్నారు. 2020 సంవత్సరంలోనే ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి బడ్జెట్ కేటాయింపు లేకపోవడంతో విధులకు రావడం లేదు. వీరు రెండు మండలాలకు ఒకరి చొప్పున ఉండడంతో ఉద్యాన పంటలను పర్యవేక్షణ, డ్రిప్ ఇరిగేషన్ పనులను పర్యవేక్షించేవారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బంది లేకపోవడంతో మూడేళ్ల నుంచి సూర్యాపేట జిల్లాలో ముగ్గురితోనే నెట్టుకొస్తున్నారు. సూర్యాపేట, తుంగతుర్తి, హుజూర్‌నగర్ నియోజకవర్గాలకు మాత్రమే అధికారులు ఉన్నారు. పండ్లతోటలు ఎక్కువగా ఉన్న కోదాడ నియోజకవర్గానికి అధికారి లేకపోవడం గమనార్హం. కోదాడకు అధికారి లేకపోవడంతో ఇక్కడి మండలాలను తుంగతుర్తి, సూర్యాపేట, హుజూర్‌నగర్ అధికారులకు కేటాయించారు. సూర్యాపేట అధికారికి ఈ విధులతో పాటు టెక్నికల్ బాధ్యతలను సైతం అప్పగించారు. ఒక్కొక్క ఉద్యానశాఖ అధికారి 6 నుంచి 8మండలాలకు ఒకరు ఉండడంతో ఒత్తిడికి లోనవుతున్నారు. రైతులకు సరైనా సలహాలు, సూచనలు ఇవ్వలేకపోతున్నారు. ఉద్యానపంటలపై ఆసక్తి ఉన్నా అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఆ పంటల సాగులో జిల్లా వెనుకబడి ఉందని రైతులు చెబుతున్నారు.

సిబ్బంది కొరతను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

సూర్యాపేట జిల్లాలో ఉద్యాన శాఖలో సిబ్బంది కొరత ఉంది. ఉద్యాన పంటల సాగుపై వేసవి ప్రభావం పడలేదు. రైతులు పంటలను కాపాడుకుంటున్నారు. ఆయిల్‌పాం సాగుకు డ్రిప్ ఇరిగేషన్స్ పెట్టుకోవాలని ప్రోత్సహిస్తున్నాం. ఔట్‌సోర్సింగ్ సిబ్బంది లేరు. అయినప్పటికీ వీలైనంత మేరకు రైతులకు సలహాలు, సూచనలు అందజేస్తున్నాం.

- టీ నాగయ్య, ఉద్యాన శాఖ అధికారి, సూర్యాపేట

గుండెపోటుతో విద్యుత్ ఉద్యోగ సంఘ నేత మృతి



సోమాచారి (ఫైల్ ఫొటో)

మిర్యాలగూడ అర్బన్, ఏప్రిల్ 12: గుండెపోటుతో విద్యుత్ ఉద్యోగుల సంఘ నాయకుడు మృతి చెందారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణానికి చెందిన విద్యుత్ శాఖలో లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న కాతోజు సోమాచారి(56) 1104 సంఘ డివిజన్ కార్యదర్శిగా, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా సేవలందిస్తున్నారు. శుక్రవారం గుండెపోటు రావడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఖమ్మం నేత్రనిధికి ఆయన కళ్లను దానం చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సోమాచారి మృతికి టీసీ ఉద్యోగ సంఘాల నేతలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కార్మికుల పక్షాన ఎనలేని సేవలు చేసిన సోమాచారి మరణం తీరని లోటన్నారు. అశోక్‌నగర్‌లో సోమాచారి భౌతికకాయానికి నివాళులర్పించి, అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు కోడిరెక్క విజయకుమార్, మారం శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, వెంకటరెడ్డి, బాలు, అమర్‌సింగ్, సీతారాములు తదితరులున్నారు. సోమాచారి మరణం సంఘానికి తీరని లోటని విశ్వకర్మ సంఘ నాయకులు పేర్కొన్నారు.

గుండాలలో యువకుడు...



మధుసూదన్‌గౌడ్(ఫైల్)

గుండాల, ఏప్రిల్ 12: యాదాద్రిభువనగిరి జిల్లా గుండాల మండలం సుద్దాల గ్రామానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు గూడ మధుసూదన్‌గౌడ్(27) గురువారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందారు. అర్ధరాత్రి గుండెపోటు రాగా కుటుంబ సభ్యులు స్థానికంగా ఉన్న ఆర్‌ఎంపీని తీసుకుని వెళ్లే సరికి మృతి చెందారు. గుండాల మండలాన్ని జనగాం నుంచి యాదాద్రి జిల్లాలో కలపడం కోసం సాగిన ప్రత్యేక ఉద్యమంలో మధుసూదన్‌గౌడ్ కీలక పాత్ర పోషించారు. అదేవిధంగా సుద్దాల-పల్లెపహాడ్ గ్రామాల మధ్య వంతెన నిర్మాణానికి పోరాటం చేశారు. మధుసూదన్‌గౌడ్ మృతదేహాన్ని శుక్రవారం ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈరసరపు యాదగిరిగౌడ్, రాష్ట్ర నాయకులు హరిశంకర్‌గౌడ్, మాజీ ఎంపీపీ ద్యావ కృష్ణారెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ మందడి రామకృష్ణారెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యుడు ఎండీ ఖలీల్, నాయకులు రవీందర్ తదితరులు సందర్శించి, నివాళులర్పించారు.

కడుపు నొప్పి తాళలేక వృద్ధుడి ఆత్మహత్య



లావూరి సూక్యా(ఫైల్)

త్రిపురారం, ఏప్రిల్ 12 : కడుపు నొప్పి తాళలేక వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా త్రిపురారం మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ వీరశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం త్రిపురారం గ్రామానికి చెందిన మర్ల చంద్రారెడ్డి వద్ద దామరచర్ల మండలం వాచ్యతండాకు చెందిన లావూరి సూక్యా(62) 15 ఏళ్లుగా జీతానికి పనిచేస్తున్నాడు. అతను గత ఏడాది నుంచి కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఎన్ని ఆసుపత్రులు తిరిగినా తగ్గలేదు. కుటుంబసభ్యులు అందరూ నిద్రిస్తుండగా ఈ నెల 11న రాత్రి సూక్యాకు తీవ్రమైన కడుపు నొప్పి వచ్చింది. నొప్పి భరించలేక ఇంట్లో ఉరేసుకున్నాడు. సూక్యాకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. భార్య కాంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపాడు.

రూ.3.48 లక్షల నగదు స్వాధీనం

కోదాడ రూరల్/ చిట్యాల రూరల్ / చండూరు, ఏప్రిల్ 12 : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసుల తనిఖీల్లో రూ.3.48 లక్షలు పట్టుబడ్డాయి. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులో శుక్రవారం విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారులో ఎలాంటి ఆధారాలు లేని రూ.1.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. అదేవిధంగా నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని వట్టిమర్తి చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో ఆధారాలు లేని రూ.68వేలను పట్టుకున్నారు. చండూరు పట్టణ శివారులో ఎలాంటి పత్రాలు లేకుండా రూ.1.30 లక్షల నగదును తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

25 నుంచి తెలుగు రాష్ట్రాల స్థాయి ఎద్దుల పోటీలు

మఠంపల్లి, ఏప్రిల్ 12: సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రంలో ఈ నెల 25వ తేదీ నుంచి 29వ తేదీ వరకు తెలుగు రాష్ట్రాల స్థాయి ఎద్దుల బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నారు. మండల కేంద్రంలోని శుభవార్త దేవాలయ తిరునాళ్ల సందర్భంగా శుభోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. సీనియర్ విభాగంలో మొదటి బహుమతి రూ.1.50లక్షలు నుంచి మొత్తం ఏడు స్థానాల్లో విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఆరు పండ్ల విభాగంలో మొదటి బహుమతి రూ.50వేల నుంచి మొత్తం ఏడు స్థానాల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. నాలుగు పండ్ల విభాగంలో మొదటి బహుమతి రూ.30వేల నుంచి మొత్తం ఏడు స్థానాల్లో విజేతలకు నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలను అందజేస్తామన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే రైతులకు తాగునీరు, భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తామని, ఆసక్తి ఉన్నవారు శుభోదయ యువజన సంఘం సెల్ 9618764924 నెంబరులో సంప్రదించాలన్నారు.

శ్రీలలితాదేవి అలంకరణలో ఎల్లమ్మ తల్లి

కనగల్, ఏప్రిల్ 10 : నల్లగొండ జిల్లా కనగల్ మండలం దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకాఎల్లమ్మ అమ్మవారు శుక్రవారం భక్తులకు శ్రీలలితాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారికి బోనాన్ని నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

తప్పిన ప్రమాదం

మునుగోడు, ఏప్రిల్ 12 : మునుగోడు మండలం కచలాపురం గ్రామంలో ఏర్పాటుచేసిన పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో లోడింగ్ చేసిన ధాన్యాన్ని స్థానికంగా ఉన్న పార్‌బాయిల్డ్ రైస్‌మిల్లులో దిగుమతి కోసం శుక్రవారం మధ్యాహ్నం లారీ బయలుదేరింది. మండల కేంద్రంలోని నార్కట్‌పల్లి వైపు ఉన్న వంతెన సమీపంలో లారీ వెనుకభాగం నుంచి ధాన్యం బస్తాలు ఒక్కసారిగా కూలీ నడిరోడ్డుపై పడ్డాయి. డ్రైవర్ అప్రమత్తతతో వెంటనే లారీని నిలిపాడు. ఎప్పుడూ రద్దీగా ఉండే రహదారిలో ఆ సమయంలో ఎవరూ లేరు. దీంతో ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

ఆరుకు చేరిన ఆటో ప్రమాద మృతులు

చికిత్స పొందుతూ ఆటోడ్రైవర్ మహేష్ మృతి



మహేష్(ఫైల్)

అర్వపల్లి / సూర్యాపేట రూరల్, ఏప్రిల్ 12 : సూర్యాపేట జిల్లా కేంద్ర సమీపంలో ఈ నెల 4వ తేదీన ఆగి ఉన్న లారీని ఆటో వెనక నుంచి ఢీకొన్న ఘటనలో మృతుల సంఖ్య ఆరుకు చేరింది. ఘటనా స్థలంలో ముగ్గురు మృతి చెందగా, రోజుల వ్యవధిలో చికిత్స పొందుతూ ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. అదేవిధంగా హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆటో డ్రైవర్ కప్పసాటి మహేష్(30) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. దీంతో మృతుల సంఖ్య ఆరుకు చేరింది. కాగా మహేష్‌కు ఆరు నెలల కిందటే వివాహమైంది.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

మోతె, ఏప్రిల్ 12: బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మోతె మండలం మామిళ్లగూడెంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రాఘవాపురం గ్రామానికి చెందిన వీరబోయిన బక్కయ్య, వీరబోయిన మల్లయ్య, వీరబోయిన మనోజ్‌లు గ్రామం నుంచి బైక్‌పై పాలేరు సంతకు వెళ్తున్నారు. మామిళ్లగూడెం గ్రామశివారులో రైతువేదిక వద్ద నుంచి ఫ్లైఓవర్ పైకి వెళ్తుండగా హైదరాబాద్ నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న కారు అతివేగంతో వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో బైక్ పైనుంచి పడి ముగ్గురికి గాయాలయ్యాయి. వీరిని 108వాహనంలో సూర్యాపేట ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

మోత్కూరు మండలంలో



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అజీద్

మోత్కూరు : యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలం కొండగడప, పాటిమట్ల గ్రామాల మధ్య శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి గాయపడ్డాడు. పాటిమట్ల గ్రామంలోని కాశవాడకు చెందిన షేక్ అజీద్ స్కూటర్‌పై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన అజీద్‌ను 108వాహనంలో నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించినట్టు ఈఎంటీ రంజిత్, పైలెట్ శంకర్ తెలిపారు. కారు చౌటుప్పల్ మండలం ఏపీలింగోటం గ్రామానికి చెందినదిగా సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ధాన్యం కొనుగోలులో జాప్యంపై ఆగ్రహం

- జాయింట్ కలెక్టర్‌కు రైతుల ఫిర్యాదు
- నల్లగొండ జిల్లా కనగల్ మండలంలో ఘటన



కనగల్ మండలంలోని జీ.ఎడవల్లి గ్రామంలో ధాన్యం ట్రాక్టర్లతో రాస్తారోకో చేస్తున్న రైతులు

కనగల్, ఏప్రిల్ 12: ధాన్యం కొనుగోలులో జాప్యాన్ని నిరసిస్తూ నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని జీ.ఎడవల్లి రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం ధాన్యం ట్రాక్టర్లతో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రైతు కానుగు భూపతి మాట్లాడుతూ ఐకేపీ కేంద్రం నిర్వాహకులు వడ్ల కొనుగోలులో సీరియల్‌ను పాటించటం లేదని, ఓ పార్టీ నాయకుల సూచన మేరకు పని చేస్తూ తమ ధాన్యాన్ని కాంటాలు వేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. 15 రోజుల క్రితం కేంద్రానికి ధాన్యం తీసుకురాగా తమకంటే వెనుక తీసుకువచ్చిన రైతుల ధాన్యం రాశులను కాంటా వేస్తున్నారన్నారు. కేంద్రంలో రోజుల తరబడి కాంటాల కోసం ఎదురుచూసి చివరకు ఇతర కేంద్రాలకు వడ్లను తీసుకెళుతున్నట్టు వాపోయారు. ఐకేపీ కేంద్రం నిర్వాహకుల తీరుపై జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. రైతుల ఆందోళనతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వారితో మాట్లాడి రాస్తారోకోను విరమింపజేశారు. రైతులు చేస్తున్న ఆరోపణలపై మండల మహిళా సమాఖ్య కార్యాలయ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ హరిని వివరణ కోరగా క్రితంసారి సెంటర్‌ను నడిపిన పీఏసీఎస్ అధికారులు సీరియల్ బుక్‌ను సకాలంలో అందించకపోవటంతో కొద్దిపాటి ఆలస్యమైందన్నారు. శుక్రవారం రాత్రి రాస్తారోకో చేసిన సదరు 9మంది రైతుల వడ్లకు కాంటాకు సీరియల్ ఉందని, ఈలోగానే వారు సెంటర్ నుంచి వడ్లను ఇతర సెంటర్లకు తీసుకువెళ్లారని తెలిపారు. ఐకేపీ నిర్వాహకులపై ఎలాంటి రాజకీయ ఒత్తిడి లేదన్నారు.

చేనేత కార్మికులకు శుభవార్త!

- నేత కార్మికులకు అండగా 'నేతన్న భరోసా' పథకం
- కొత్త విధానానికి సర్కారు కసరత్తు
- త్వరలో ప్రారంభానికి కాంగ్రెస్ ప్రభుత్వం సన్నాహకం



భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 12 : ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నేత కార్మికులకు అండగా నిలిచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం 'నేతన్న భరోసా' కార్యక్రమాన్ని త్వరలో అమలు చేయనుంది. చేనేతల దీర్ఘకాలిక ప్రయోజనాలే లక్ష్యంగా ప్రభుత్వం ఆర్డర్లన్నీ 'టెస్కో' ద్వారానే కొనసాగించాలని నిర్ణయించింది. చేనేత కార్మికుల స్వయం సమృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం 'నేతన్న భరోసా' అనే కొత్త విధానానికి రూపకల్పన చేస్తోంది. చేనేత, మరమగ్గాల కార్మికులకు దీర్ఘకాలిక లబ్ధి చేకూరేలా కొత్త పథకం ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే అధికారులను ఆదేశించారు. ఈ మేరకు త్వరలో 'నేతన్న భరోసా' కార్యక్రమానికి కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. ఈ పథకంతో చేనేత, మరమగ్గాల కార్మికుల సంక్షేమానికి తాత్కాలిక ప్రయోజనం కన్నా దీర్ఘకాలిక లబ్ధి చేకూరేలా ఈ విధానాన్ని తీసుకు రానున్నారు. ఏడాది మొత్తం పని ఉండేలా రూపకల్పన చేస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా రాష్ట్రంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ) ఏర్పాటు, హ్యాండ్లూమ్ పార్కు పునరుద్ధరణ, కొత్త పవర్‌లూమ్ క్లస్టర్ల అభివృద్ధి, మైక్రో హ్యాండ్లూమ్ క్లస్టర్ల ఏర్పాటు, నేషనల్ సెంటర్ ఫర్ డిజైన్ల ఏర్పాటు, స్టేట్ టెక్నికల్ టెక్స్‌టైల్స్ పాలసీ తెచ్చేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందని ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. నేతన్నల కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి వివిధ పథకాలను అనుసంధానం చేయడంతోపాటు రావాల్సిన బకాయిలను తెచ్చుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆ అధికారి తెలిపారు.

చేనేత వస్త్రాల కొనుగోలు ప్రక్రియ 'టెస్కో' ద్వారానే ..

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని చేనేత సహకార సంఘాలకు పెండింగ్‌లో ఉన్న రూ.8.81 కోట్ల బకాయిలను విడుదల చేసిన ప్రభుత్వం అన్ని ప్రభుత్వ శాఖలు 'టెస్కో' ద్వారానే వస్త్రాలను కొనుగోలు చేయాలని నిర్ణయించారు. మ్యాక్స్ సహకార సంఘాలను ప్రోత్సహించిన బీఆర్‌ఎస్ సర్కారు విధానాలతో అసలైన కార్మికులకు లబ్ధి చేకూరలేదని, వ్యాపారులు, దళారుల జోక్యం మితిమీరిందనే ఆరోపణలు అప్పట్లో వెల్లువెత్తాయి. రాష్ట్రంలో 393 చేనేత సహకార సంఘాలు ఉంటే, కేవలం 105 చేనేత సహకార సంఘాలకు మాత్రమే పనికల్పించినట్లు ప్రస్తుత ప్రభుత్వ విచారణలో వెల్లడైంది. ఇందుకు భిన్నంగా అన్ని చేనేత సహకార సంఘాలకు పని కల్పించాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు రూ.53 కోట్ల వస్త్రాలు కొనుగోలు చేసి, గతంలో చేనేత సహకార సంఘాలకు పెండింగ్‌లో ఉన్న రూ. 8.81కోట్ల బకాయిలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసింది. మార్చి 11వ తేదీ జీవో 1ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అమలుపరుస్తూ టెస్కో ద్వారానే అన్ని ప్రభుత్వ శాఖలు వస్త్రాలు కొనుగోలు చేయాలని ఆదేశించింది. దీంతో టెస్కోలో లభ్యంకాని వస్త్రాలకు నాన్ ఎవైలబులిటీ సర్టిఫికేట్ ఇస్తే తప్ప, ప్రైవేటు ఏజెన్సీల నుంచి కొనుగోలు చేసే అవకాశం ఉండదు. ఈ మేరకు ఇప్పటికే వివిధ ప్రభుత్వ శాఖలు వస్త్రాల సరఫరా కోసం టెస్కోకు రూ.255.27 కోట్ల విలువైన ఆర్డర్లు ఇచ్చినట్లు సమాచారం.

చేనేత సంఘాలకు నూతన జవసత్వాలు

ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఉన్న చేనేత సహకార సంఘాలకు 'నేతన్న భరోసా' పథకంతో మళ్లీ నూతన జవసత్వాలు కలుగనున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ శాఖలు 'టెస్కో' ద్వారానే వస్త్రాల కొనుగోళ్లు చేయాలని భావిస్తుండటంతో చేనేత సహకార సంఘాలకు పూర్వవైభవం సంతరించే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 72 చేనేత సహకార సంఘాలున్నాయి. వీటిపై 32 వేలకు పైగా కుటుంబాలు ఆధారపడి ఉన్నాయి. చేనేత గిట్టుబాటు కాక పసలు రకాల పనులు చేస్తూ పొట్టపోసుకుంటున్న కుటుంబాలు వేల సంఖ్యలో ఉన్నాయి. గుమస్తాలుగా, రోజు వారి కూలీలుగా, సెక్యూరిటీలుగా, సైకిళ్లపై తిరిగి వస్త్రాలు విక్రయిస్తూ భారంగా జీవనం సాగిస్తున్నారు. భీవండి, షోలాపూర్, సూరత్, అహ్మదాబాద్‌లకు వలస వెళ్లి అక్కడి మిల్లుల్లో కూలీలుగా పనిచేస్తున్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయనున్న చేనేత పథకాల వల్ల తమకు లబ్ధి కలిగే అవకాశం ఉందని చేనేత కార్మికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఏదైమైనా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించనున్న 'నేతన్న భరోసా' వల్ల చేనేత కార్మికుల దశాబ్దాల కల సాకారం కానుందని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాంగ్రెస్‌ను ఏ పార్టీ ఢీకొట్టలేదు : సామేల్


సామేల్ సమక్షంలో పార్టీలో చేరుతున్న ఎంపీటీసీలు, తాజా మాజీ సర్పంచులు

శాలిగౌరారం, ఏప్రిల్ 12: రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీని ఏ పార్టీ ఢీకొట్టలేదని, ప్రధాని మోదీని ఈ ఎన్నికల్లో ఇంటికి పంపడం ఖాయమని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన నూక కిరణ్‌కుమార్, శాలిగౌరారం ఎంపీటీసీ జోగు సైదమ్మశ్రీనివాస్, తాజా మాజీ సర్పంచులు జటంగి శంకర్ (రామాంజపురం), గౌర వీరయ్య (తిరుమలరాయినిగూడెం), బండారు శంకర్ (రామగిరి), షేక్ ఖాసీంబీ (జాలోనిగూడెం), శ్రీరామదాస్ రాజు, షేక్ జహంగీర్, నూక కిషోర్, జమ్ము అశోక్‌తో పాటు మరో వంద మంది వివిధ గ్రామాల నుంచి ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సామేల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, నాయకులు చాడ సురేష్ రెడ్డి, మహేందర్‌రెడ్డి, జనార్ధన్, వీరభద్రం, వెంకటయ్య, గోపీనాథ్ పాల్గొన్నారు.

'ఉపాధి' పనులను సద్వినియోగం చేసుకోవాలి


ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో కరుణాకర్‌రావు

అడవిదేవులపల్లి, ఏప్రిల్ 12: గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కరుణాకర్‌రావు అన్నారు. మండలంలోని చిట్యాల, అడవిదేవులపల్లి గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. పని ప్రదేశంలో కూలీలకు కల్పిస్తున్న వసతులపై ఆరా తీశారు. వేసవికాలంలో ఎండలు విపరీతంగా ఉంటున్నందున పని ప్రదేశాల్లో తాగునీరు తప్పకుండా ఉండేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. వడదెబ్బ తగలకుండా ఓఆర్ఎస్‌ను నీటిలో కలుపుకొని తాగాలని సూచించారు. అదేవిధంగా గ్రామాల్లోని నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఏపీవో సూర్యనాయక్, టీఏలు, ఎఫ్ఏలు తదితరులు ఉన్నారు.

కట్టంగూరు: మండలంలోని కల్మెర గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీవో కడియం రాంమోహన్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పూడికతీత పనులను పరిశీలించి మస్టర్‌ను తనిఖీ చేశారు. కేంద్రప్రభుత్వం ఉపాధి కూలిని రూ.272 నుంచి రూ.300లకు పెంచిందని దానిని ఉపాధి కూలీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పద్మశాలీలను నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం

చండూరు రూరల్, ఏప్రిల్ 12: కాంగ్రెస్ ప్రభుత్వం పద్మశాలీలను నిర్లక్ష్యం చేస్తూ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో అన్యాయం చేస్తుందని పద్మశాలీ రాజ్యాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ ఏలే మహేష్ అన్నారు. చండూరు మండలం కొండాపురం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి పార్లమెంట్ నుంచి పద్మశాలీ రాజ్యాధికార సమితి పోటీ చేస్తుందని, మా బలగం మా ఓట్లు మా పద్మశాలీలకే అనే నినాదంతో బరిలో ఉంటామని పేర్కొన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఓడిస్తామని పేర్కొన్నారు. మార్పు అనే సందేశంతో ప్రజల్లోకి వెళ్లిన కాంగ్రెస్ పార్టీ బడుగు, బలహీన వర్గాలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని అన్నారు. సమావేశంలో నాయకులు గుర్రం నవీన్, చెరుకు విజయ్, జెల్ల రఘు, తిరందాసు చంద్రం, చెరుపల్లి నాగరాజు, పున్న ప్రవీణ్, గంజి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షాన పోరాడిన యోధుడు నాగయ్య

నల్లగొండరూరల్, ఏప్రిల్ 12: పేదల సమస్యల పరిష్కారానికి సీపీఎం నాయకుడు వేముల నాగయ్య ఎంతో కృషి చేశారని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. నాగయ్య వర్ధంతి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని దొడ్డి కొమురయ్య భవన్‌లో ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ కనగల్ మండలానికి చెందిన నాగయ్య యువజన నాయకుడిగా ప్రస్థానం ప్రారంభించి నిరంతరం కష్ట జీవుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేశారని గుర్తు చేశారు. సాగు, తాగునీరు కోసం ఎస్ఎల్‌బీసీ సాధన కోసం, కల్లుగీత కార్మిక సంఘాల బలోపేతం కోసం గ్రామగ్రామాన సంఘాలు ఏర్పాటు చేసి హక్కులు సాధించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు తుమ్మల వీరారెడ్డి, పాలడుగు నాగార్జున, లక్ష్మీనారాయణ, అంచాలు, గంజి మురళీధర్, సత్తయ్య, నర్సిరెడ్డి, కొండ వెంకన్న, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు భూముల కోసం పోరాడిన భిక్షానాయక్

మిర్యాలగూడ, ఏప్రిల్ 12: పేదలకు ఇళ్లు, భూముల కోసం భిక్షానాయక్ పోరాడారని మాజీ ఎమ్మెల్యే భిక్షానాయక్ అన్నారు. శుక్రవారం భిక్షానాయక్ వర్ధంతి సందర్భంగా ఆయన స్థూపం వద్ద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. సీపీఎం పక్షాన పేదల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న భిక్షానాయక్‌ను భూస్వామ్య గూండాలు హత్య చేశాయని అన్నారు. అమరుడు భిక్షానాయక్ స్ఫూర్తితో నియోజకవర్గంలో పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు, భూమి ఇప్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బీకార్ మల్లేష్, నాయకులు వారేపల్లి వెంకటేశ్వర్లు, నూకల జగదీష్‌చంద్ర, రవినాయక్, బావాండ్ల పాండు, మల్లు గౌతంరెడ్డి, తిరుపతి రాంమూర్తి, వినోద్‌నాయక్, రాగిరెడ్డి మంగారెడ్డి, గాదె పద్మ, పిల్లుట్ల సైదులు, వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధన్, కోడిరెక్క మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలి

కొండమల్లేపల్లి, ఏప్రిల్ 12: మహాత్మా జ్యోతిరావుపూలే, అంబేద్కర్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్, వివిధ ప్రజా సంఘాల నాయకులు కోరారు. దేవరకొండ పట్టణంలోని అంబేద్కర్ గ్రంథాలయంలో జ్యోతిరావుపూలే, అంబేద్కర్ జయంతి ఉత్సవాల నిర్వహణపై ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. దేవరకొండ, కొండమల్లేపల్లిలలో అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆదివారం ర్యాలీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు యేకుల రాజారావు, బుర్రి వెంకన్న, మద్దిమడుగు భిక్షపతి, యేకుల సురేష్, గోపాల్, శ్రీనివాస్ గౌడ్, భాస్కరాచారి, చంద్రమౌళి, భాస్కరాచారి, ఆంజనేయులు పాల్గొన్నారు.

వివాదంగా టెండర్ బకాయిలు

» లోపభూయిష్టంగా విక్రయ వేలం » వేలం డబ్బులు చెల్లించకున్నా హక్కులు » ఎల్లారెడ్డిగూడెం పంచాయతీకి పేరుకున్న బకాయిలు

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 12: నార్కట్‌పల్లి మండలంలోని ఎల్లారెడ్డిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో టెండర్ల నిర్వహణ లోపభూయిష్టంగా మారింది. చెర్వుగట్టు ఆలయానికి వచ్చే భక్తులకు కొబ్బరికాయలు విక్రయించేందుకు ప్రతి ఏడాది వేలం నిర్వహిస్తారు. గ్రామ పంచాయతీకి సింహభాగం ఆదాయాన్ని సమకూరుస్తున్న కొబ్బరికాయల విక్రయ టెండరు వేలంపై పంచాయితీ అధికారుల వైఖరి విమర్శలకు తావిస్తోంది. పైగా టెండర్ నిబంధనలకు తిలోదకాలివ్వడమే కాకుండా గ్రామ పంచాయతీకి లక్షల్లో పేరుకుపోయిన బకాయిల వసూళ్ల విషయంలో పదవీకాలం పూర్తయినా పంచాయతీ పాలకవర్గం, 'కార్యదర్శుల' నిర్వాకం నవ్వులపాలు చేసిందన్న విమర్శలు వినవస్తున్నాయి. టెండర్ నిర్వహణలో చేసిన పొరపాటుతో ఒక పర్యాయం వాటిల్లిన నష్టం, ఎదుర్కొంటున్న ఇబ్బందులు తెలిసి కూడా అదే తప్పును పంచాయతీ అధికారులు రెండోసారి పునరావృతం చేయడం ఆశ్చర్యపరిచే విషయం. బకాయిల చెల్లింపులో టెండరుదారుల వైఖరి గ్రామ పంచాయతీ ఆదాయానికి గండిపడేలా చేస్తున్నా సదరు అధికారులు మాత్రం కేవలం నోటీసులు ఇచ్చి చోద్యం చూడటం విస్మయం కలిగిస్తుంది.

లోపభూయిష్టంగా టెండర్ నిర్వహణ

టెండర్ నిర్వహణ పూర్తి లోపభూయిష్టంగా ఉన్నట్లు అర్థమవుతోంది. వేలం నిబంధనలను పంచాయతీ పాలకమండలి, కార్యదర్శి పూర్తిగా తుంగలో తొక్కినట్లు అవగతమవుతోంది. టెండర్ నిబంధనల మేరకు కొబ్బరికాయల వేలం హక్కు పొందిన 24 గంటలలోపే పూర్తి మొత్తం డబ్బులను చెల్లించిన తర్వాతే కొబ్బరికాయల విక్రయహక్కులు ఇవ్వాలి. లేకపోతే రెండో పోటీదారుకు హక్కును కల్పించాలి. కానీ వేలంలో పాడిన మేరకు మొత్తం డబ్బులు కట్టకున్నా టెండర్ హక్కులను ఇచ్చేశారు. ఇక్కడ తిలా పాపం తలా పిడికెడు అన్న చందంగా పంచాయతీ కార్యదర్శికి తోడు అప్పటి పాలకవర్గం కూడా సహకరించడంతో బకాయిలు పెరిగిపోయాయి. ఈ వ్యవహారంపై గ్రామంలో విమర్శలు రావడంతో పంచాయతీ శాఖ అధికారులు నోటీసుల జారీ, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులకే పరిమితమయ్యారు.

మళ్లీ అదే తప్పు

2022-23 టెండర్ బకాయిల వివాదం ఓ వైపు కొనసాగుతూ ఉండగా ఆ అనుభవాలు కళ్ల ముందున్నా ఏడాది కాలపరిమితి కింద 2023-24 సంవత్సరానికి నిర్వహించిన కొబ్బరికాయల విక్రయ వేలంలోనూ గ్రామ పంచాయతీ మళ్లీ అదే తప్పు చేయడం గమనార్హం. గ్రామానికి చెందిన చిక్కుళ్ల శంకర్ అనే వ్యక్తి కొబ్బరికాయల విక్రయ హక్కు వేలం టెండర్‌ను అత్యధిక పాట పాడి కైవసం చేసుకున్నాడు. 24 గంటల్లోపు మొత్తం చెల్లిస్తేనే టెండర్ హక్కులు కల్పించాల్సి ఉండగా గ్రామ పంచాయతీ మాత్రం తప్పును పునరావృతం చేసి మొత్తం టెండరు డబ్బులు తీసుకోకుండానే హక్కులు కల్పించారు.



ఎల్లారెడ్డిగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం

ఆర్‌టీఐకి సమాచారం దాటవేత

గ్రామ పంచాయతీ పరిధిలో ఇప్పటి వరకు టెంకాయల విక్రయం టెండర్ల ద్వారా సమకూరిన ఆదాయంపై వివరాలు కోరుతూ గ్రామానికి చెందిన పలువురు ఆర్‌టీఐ ద్వారా సమాచారం కోరినా దాటవేస్తున్నట్లు సమాచారం. టెండర్లు ఎన్నిసార్లు నిర్వహించారు. మొత్తం ఎంత మొత్తంలో ఆదాయం సమకూరింది. ఇంకా బకాయిలు ఎన్ని ఉన్నాయి, వాటి వసూళ్ల కోసం తీసుకున్న చర్యలేమిటో చెప్పాలని ఆర్‌టీఐ ద్వారా కోరినా సమాచారం ఇవ్వడం లేదు. అధికారుల వైఖరిపై ఆర్‌టీఐ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తే అరకొర సమాచారంతో సరిపెడుతున్నారని తెలిసింది.

బకాయిలు మొత్తం రూ.38.10లక్షలు

వరుసగా మూడు సంవత్సరాల కొబ్బరికాయల టెండర్ బకాయిలు మొత్తం కలిపి ఇప్పటికి సుమారు రూ.38.10 లక్షలకు చేరుకున్నట్లు గ్రామ పంచాయతీ రికార్డులు చెబుతున్నాయి. 2021-22 సంవత్సరానికి గాను గ్రామ పంచాయతీ పరిధిలో కొబ్బరికాయల విక్రయ వేలం హక్కును అదే గ్రామానికి చెందిన రమేష్ అనే వ్యక్తి పాట పాడి గ్రామ పంచాయతీకి ఇంకా రూ.1.10 లక్షలు చెల్లించాల్సి ఉంది. అదేవిధంగా 2022-23 సంవత్సరానికి గాను గోపాల్ అనే వ్యక్తి ఇంకా రూ.17 లక్షలు, 2023-24 (ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (ఆగస్టు వరకు) నకు సంబంధించిన టెండర్ బకాయిలు సుమారు రూ.20లక్షలు చెల్లించాల్సి ఉన్నట్లు తెలిసింది. కానీ వరుస ఇద్దరు టెండర్‌దారులు తమ టెండర్ కాలపరిమితి పూర్తయి ఏడాది గడిచినా టెండర్ బకాయిలు డబ్బులు పూర్తిగా చెల్లించలేదు. ఇప్పటికే ఇరువురూ మూడు సార్లు నోటీసులు అందుకున్నారు. కాగా ఈ బకాయిల వ్యవహారం గ్రామంలో రాజకీయ వివాదానికి దారితీసింది.

నోటీసులు ఇచ్చాం

మూడేళ్లుగా గ్రామ పంచాయతీకి కొబ్బరికాయల వేలం హక్కుల టెండరుదారులు సుమారు రూ.38లక్షల మేర బకాయిలు ఉన్న మాట వాస్తవమే. ఇందులో 2021-22, 2022-23 రెండేళ్లు తనకన్నా ముందు పనిచేసిన పంచాయతీ కార్యదర్శి హయాంలోని బకాయిలు. బకాయిల వసూళ్ల కోసం ఇప్పటికే వరుస మూడు నోటీసులు పంపించాం. తుది నోటీసు కూడా పంపాం. నోటీసులపై వారినుంచి స్పందన రాకపోతే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

- కృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి, ఎల్లారెడ్డిగూడెం

రైతుల ఖాతాల్లో రూ.12.66 కోట్లు జమ

కట్టంగూరు, చిట్యాల, ఏప్రిల్ 12: జిల్లాలో 370 ఐకేపీ కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి ఇప్పటివరకు రూ.12.66 కోట్ల నగదును రైతుల ఖాతాలో నేరుగా జమ చేసినట్లు డీసీఎస్‌వో వెంకటేశ్వర్లు తెలిపారు. కట్టంగూరు మండలంలోని కట్టంగూరు, అయిటిపాముల, చిట్యాలలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల వసతులు కల్పించాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు రాగానే వారి పేర్లు నమోదు చేసుకుని ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. రైతులకు మంచినీటి వసతి, నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేయాలన్నారు. అకాల వర్షాలు పడే అవకాశం ఉన్నందున టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని కోరారు. జిల్లాలో 370 సెంటర్ల ద్వారా ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయని, ఇప్పటి వరకు 8,809 మంది రైతుల నుంచి 63,500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి సంబంధిత మిల్లులకు రవాణా చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో డీటీసీఎస్ జ్యోతి, సురేష్, ఏపీఎం సైదులు, చంద్రయ్య, చిట్యాల ఆర్ఐ లింగస్వామి పాల్గొన్నారు.


అయిటిపాములలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న వెంకటేశ్వర్లు

కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి : ఏపీఎం

హాలియా: అనుముల మండలంలోని రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం కళావతి సూచించారు. శుక్రవారం అనుముల మండలంలోని రామడుగు, మారేపల్లి, పులిమామిడి కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం 1010 ధాన్యానికి రూ. 2,203 మద్దతు ధర అందిస్తూ కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. ఇప్పటికే రామడుగు ఐకేపీ నుంచి 4,304, మారేపల్లి నుంచి 3,020, శ్రీనాధపురం నుంచి 2,981, పులిమామిడి నుంచి 1445 బస్తాలను రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపారు. వారి వెంట సీసీలు చారి, సైదులు తదితరులు ఉన్నారు.

ధాన్యం కాంటాలు వేగవంతం చేయాలి : పీడీ

తిప్పర్తి: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని డీఆర్‌డీవో పీడీ నాగిరెడ్డి అన్నారు. తిప్పర్తి మండల పరిధిలోని అనిశెట్టి దుప్పలపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. మార్కెట్‌లో సీరియల్, ఆన్‌లైన్‌లో డాటా ఎంట్రీ, రిజిస్టర్ వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతుల వద్ద హమాలీ డబ్బులు ఎక్కువగా తీసుకోవద్దని, వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట ఏపీఎం శ్రీదేవి, నిర్వాహకులు పాల్గొన్నారు.

నేతన్నల బతుకులు మారాలంటే మోదీ రావాలి

● భువనగిరి ఎంపీ బీజేపీ అభ్యర్థి నర్సయ్యగౌడ్


గట్టుప్పల్‌లో మాట్లాడుతున్న బూర నర్సయ్యగౌడ్

గట్టుప్పల్, చండూరు, చిట్యాల, ఏప్రిల్ 12: నేత కార్మికుల బతుకులు మారాలంటే మరోసారి కేంద్రంలో మోదీ ప్రభుత్వం రావాలని భువనగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ అన్నారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన చేనేత భరోసా యాత్ర శుక్రవారం జిల్లాలోని గట్టుప్పల్, చండూరు, చిట్యాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని భరోసా కల్పించారు. చేనేత పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయిందని, చేనేత సహకార సంఘాల్లో పేరుకుపోయిన వస్త్ర నిల్వలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. కార్మికులు తయారు చేసిన వస్త్రానికి మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. చేనేత కార్మికులకు చేతినిండా పని కల్పిస్తామని కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం రాయితీ కల్పించాలని అన్నారు. చేనేత కార్మికులకు సవాలుగా మారిన ప్రింటెడ్ డిజైన్లను అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. చేనేత సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. గతంలో ఈ ప్రాంత ఎంపీగా ఉండి ఎయిమ్స్, కేంద్రీయ విశ్వవిద్యాలయం, ఎంఎంటీఎస్, పాస్‌పోర్టు కార్యాలయం, జాతీయ రహదారుల విస్తరణ, దండుమల్కాపురంలో ఇండస్ట్రియల్ పార్కు వంటి అభివృద్ధి పనులను తీసుకొచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కర్నాటి ధనంజయ, దోనూరి వీరారెడ్డి, దూడల బిక్షంగౌడ్, కంప దుర్గయ్య, యెన్నం శివకుమార్, చిలువేరు దుర్గయ్య, రాపోలు గోపీనాథ్, తిరందాస్ అంజనేయులు, భీమగాని జంగయ్య, కొంగరి గణేష్, రాపోలు మార్కండేయ, తిరందాస్ చంద్రమౌళి, పాండు, శంకర్, నరహరి, శంకర్ పాల్గొన్నారు.

రాజకీయాల్లోకి వచ్చి ఆస్తులు పొగొట్టుకున్నా...

రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత ఆస్తులు పోగొట్టుకున్నానని, కానీ ప్రజల సంపదను పెంచానన్న తృప్తి ఉందని బూర నర్సయ్యగౌడ్ అన్నారు. దేశం, ధర్మం, అభివృద్ధి లక్ష్యంతో ముందుకు పోతున్న ప్రధానిమోదీని మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కోమటి వీరేశం, జిల్లా ఉపాధ్యక్షుడు మిర్యాల వెంకన్న, సోమ నర్సింహ, చేనేత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు తిరందాసు శ్రీను, నాయకులు వీరారెడ్డి, ధనంజయ, ఆంజనేయులు, సత్యం, రామచంద్రయ్య, హరినాథ్, జనార్ధన్‌రెడ్డి, మురళీమనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశ ఉజ్వల భవిష్యత్తు కోసం బీజేపీని గెలిపించాలి

దేశ ఉజ్వల భవిష్యత్తు కోసం మరోసారి బీజేపీని గెలిపించాలని భువనగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి నర్సయ్యగౌడ్ అన్నారు. సురక్షిత భారతానికి, సుస్థిర అభివృద్ధి కోసం బీజేపీని గెలిపించాలని కోరారు. ప్రతీ కార్యకర్త ఇంటింటికి వెళ్లి కేంద్రప్రభుత్వ పథకాలను వివరించి ఓట్లు అడగాలని కోరారు. కార్యక్రమంలో షైల నర్సింహ, పల్లె వెంకన్నగౌడ్, పాపని వనజవాసుదేవ్ పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ పార్లమెంటరీ ఎన్నికల సన్నాహక సమావేశం

● దేవరకొండలో ఏర్పాటు ● హాజరుకానున్న మంత్రులు ఉత్తమ్, వెంకట్‌రెడ్డి

దేవరకొండ, ఏప్రిల్ 12: దేవరకొండ పట్టణంలోని సాయిశివ గార్డెన్‌లో ఈ నెల 13వ తేదీ సాయంత్రం 3.30 గంటలకు నల్లగొండ కాంగ్రెస్ పార్లమెంటరీ సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ తెలిపారు. శుక్రవారం దేవరకొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 13న సాయంత్రం 3.30 గంటలకు పట్టణంలోని సాయిశివగార్డెన్‌లో జరగనున్న దేవరకొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్లమెంటరీ సమావేశానికి మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి, పార్లమెంట్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

కాంగ్రెస్‌లో నేడు చేరికలు

దేవరకొండలో శనివారం జరగనున్న కాంగ్రెస్ పార్లమెంటరీ సమావేశంలో మంత్రుల సమక్షంలో ఎమ్మెల్యే బాలునాయక్ ఆధ్వర్యంలో భారీగా ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీకి చెందిన ముఖ్యనాయకులు కాంగ్రెస్‌లో చేరనున్నారు. పీఏపల్లి మండలానికి చెందిన ఎంపీపీ వంగాల ప్రతాప్‌రెడ్డితో పాటు మండలంలోని 16 గ్రామాల మాజీ సర్పంచులు ఇప్పటికే బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. కాగా డిండి మండల జడ్పీటీసీ, సీనియర్ నాయకుడు మాధవరం దేవేందర్‌రావు ఆధ్వర్యంలో డిండి మండలం నుంచి భారీగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరనున్నారు. దేవరకొండ పట్టణానికి చెందిన పలువురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు కూడా కాంగ్రెస్‌లో చేరేందుకు సన్నద్ధమవుతున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. డిండి, చందంపేట, నేరేడుగొమ్ము, కొండమల్లేపల్లి, చింతపల్లి మండలాలకు చెందిన బీఆర్ఎస్ ముఖ్యనాయకులు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు సమాచారం.

ప్రజల పక్షాన పోరాడే వ్యక్తిని గెలిపించాలి

కట్టంగూరు, ఏప్రిల్ 12: ప్రజల పక్షాన పోరాడే భువనగిరి పార్లమెంట్ సీపీఎం అభ్యర్థి ఎండీ. జహంగీర్‌ను గెలిపించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి కోరారు. కట్టంగూరులోని అమరవీరుల స్మారక భవనంలో శుక్రవారం జరిగిన మండల జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశానికి నరేంద్ర మోదీ చేసింది ఏమీలేదని నరేంద్ర మోదీ ప్రభుత్వ హయాంలో దేశంలో అవినీతి మితిమీరిపోయిందని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే గత పాలకులకు పట్టిన గతే పడుతుందని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చిన్నపాక లక్ష్మీనారాయణ, గంజి మురళీధర్, దండెంపల్లి సత్తయ్య, పెంజర్ల సైదులు, మురారి మోహన్, రవీంద్రచారి, రమేష్, బక్కయ్య, యాదయ్య, రామస్వామి, సత్తయ్య, సైదులు పాల్గొన్నారు.

మోదీ హ్యాట్రిక్ సాధించడం ఖాయం

● నల్లగొండ ఎంపీ బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి

నల్లగొండ, ఏప్రిల్ 12: కేంద్రంలో బీజేపీ 400సీట్ల మెజారిటీతో అధికారంలోకి రాబోతుందని, మోదీ హ్యాట్రిక్ సాధించడం ఖాయమని నల్లగొండ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. బీజేపీ ఎన్నికల ప్రచార రథాన్ని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం వారు ప్రారంభించి మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. దేశం సురక్షితంగా ఉండాలంటే నరేంద్రమోదీ పాలనతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ క న్వీనర్ బండారు ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీదేవిరెడ్డి, పిల్లి రామరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతేపాక లింగస్వామి, రాష్ట్ర నాయకులు పోతేపాక సాంబయ్య, జిల్లా కోశాధికారి పకీరు మోహన్‌రెడ్డి, దాయం భూపాల్ రెడ్డి, యాదగిరిచారి, మహేష్, నీరజ తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న శానంపూడి సైదిరెడ్డి, వర్షిత్‌రెడ్డి

సంక్షిప్త సమాచారం...

హాలియా: హాలియా పట్టణంలో శనివారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు కరెంట్ లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగించటానికి యాచారం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడనున్నట్లు హాలియా విద్యుత్ ఏఈ బాలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ యాచారం ఫీడర్ కింద ఉన్న గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ గృహ, వాణిజ్య వినియోగదారులు, రైతులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

కట్టంగూరు: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ మండలంలోని అయిటిపాముల గ్రామంలో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో దళిత మోర్చా బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోలి ప్రభాకర్, నాయకులు మహేశ్వరి, విజయ్‌కుమార్, శ్రీరామ్ పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: బీసీ సంక్షేమ జాతీయ సంఘం యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా మండలంలోని ఎం.ఎడవల్లి గ్రామానికి చెందిన ఆందోజు మహేందర్ నియమితులయ్యారు. ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య శుక్రవారం నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ జిల్లాలో బీసీ సంక్షేమ సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

మిర్యాలగూడ టౌన్: వయోజనులందరూ ఓటు నమోదు చేసుకోవాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రూపావత్ హరిప్రసాద్ కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, 18 సంవత్సరాలు నిండిన విద్యార్థులంతా ఓటు నమోదు చేసుకోవాలన్నారు.

పెద్దవూర: మండలంలోని బసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త తుడుం నరేందర్ రేబిస్ వ్యాధితో గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి శుక్రవారం ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, నల్లగొండ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డితో కలిసి నరేందర్ మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వారి వెంట జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శంకర్‌నాయక్, యాదగిరి పాల్గొన్నారు.

మర్రిగూడ: భువనగిరి పార్లమెంట్ సీపీఎం ఎంపీ అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య కోరారు. మండలంలోని ఇందుర్తి గ్రామంలో ఉపాధి పనులు చేపడుతున్న కూలీల దగ్గరకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఉపాధి కూలీలకు వేతనాలు పెరగాలంటే సీపీఎంను గెలిపించాలని కోరారు.

మర్రిగూడ: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మర్రిగూడ కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలని కోరారు. ఆయన్ను కలిసిన వారిలో రాంరెడ్డిపల్లి ఎంపీటీసీ యెన్నంనేని రవీందర్‌రావు, వట్టిపల్లి మాజీ ఎంపీటీసీ రమావత్ భీమానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, వెంకటేష్, నాయకులు వెంకటేష్, నర్సింహ, అజిత్‌రెడ్డి, బంగారం ఉన్నారు.

మాడ్గులపల్లి: కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని చెరువుపల్లి గ్రామానికి చెందిన గడ్డం వెంకట్‌రెడ్డి ఎన్నికయ్యారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి వెంకట్‌రెడ్డికి నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

నల్లగొండ: బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా నల్లగొండ పట్టణానికి చెందిన ఏరుకొండ హరి నియమితులయ్యారు. ఈ మేరకు మోర్చా జిల్లా అధ్యక్షుడు పిట్టల శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ ఓబీసీ హక్కుల సాధన కోసం, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.

మాడ్గులపల్లి: అనారోగ్యంతో మృతి చెందిన కాంగ్రెస్ నాయకురాలు నామ చంద్రమ్మ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ అన్నారు. మండలంలోని చిరుమర్తి గ్రామంలో చంద్రమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట జడ్పీటీసీ పుల్లెంల సైదులు, నాయకులు కట్టా సిద్దార్థరెడ్డి, గోపాల్‌రెడ్డి, వెంకన్న ఉన్నారు.

గుర్రంపోడు: మండలకేంద్రంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ సప్తమ వార్షికోత్సవంతో పాటు కల్యాణ మహోత్సవానికి సిద్ధమైంది. దేవాలయ ప్రాంగణంలో శనివారం ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ, స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ చైర్మన్ జాల పెద్దసత్తయ్యయాదవ్, ఆలయ పూజారి కిరణ్‌కుమారాచార్యులు తెలిపారు. మండలకేంద్రంలోని ప్రధాన వీధులతో పాటు దేవాలయ ప్రాంగణం విద్యుత్‌కాంతులతో విరాజిల్లుతుంది.

భువనగిరిపై ఎర్ర జెండా ఎగరాలి : రంగారెడ్డి

గట్టుప్పల్, ఏప్రిల్ 12: భారత రాజ్యాంగాన్ని మార్చాలని కుట్ర చేస్తున్న బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని, భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించి భువనగిరి కోటపై ఎర్రజెండా ఎగుర వేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన పార్టీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. మునుగోడు నియోజకవర్గ వెనుకబాటుకు గత పాలకులే కారణమని అన్నారు. మూసీ నది ప్రక్షాళన చేయాలని పాదయాత్రలు, సాగు, తాగునీరు కోసం పోరాటాలు నిర్వహించడంలో కమ్యూనిస్టులు కీలకపాత్ర పోషించారని అన్నారు. మునుగోడు నియోజకవర్గంలో అనేక సమస్యలపై సీపీఎం నిరంతరం పోరాడుతూనే ఉందన్నారు. పూటకో పార్టీలు మార్చే నాయకులను ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు చాపల మారయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు బండ శ్రీశైలం, మారయ్య, మొగుదాల వెంకటేశం, ధనుంజయగౌడ్, కర్నాటి సుధాకర్, శ్రీనివాస్, శ్రీను, ఖమ్మం రాములు, పెద్దగాని నరసింహ తదితరులు పాల్గొన్నారు.